ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 4 అక్టోబరు 2024



నేడు అల్పపీడనం

● రాష్ట్రానికి వర్షసూచన

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలు కురవనున్న నేపథ్యంలో శుక్రవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు భారత వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు క్రమంగా బలహీనపడుతున్నప్పటికీ రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలు ఈ నెల మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా బంగాళాఖాతంలో మాల్దీవులకు చేరువగా అల్పపీడనం ఏర్పడనుందని, అది క్రమంగా వాయుగుండంగా మారే అవకాశం కూడా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. రాష్ట్రంలోని రామనాథపురం, శివగంగ, పుదుకోట, తంజావూరు, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లోనూ చెదురుమదురు వర్షాలు కురుస్తాయి. నగరానికి సంబంధించినంత వరకూ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



లారీలో పడవ తరలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కార్పొరేషన్‌లో 36 పడవలు సిద్ధం...

ఈశాన్య రుతుపవన ప్రభావంతో ఈ నెల మొదటి వారం నుంచి వర్షాలు తీవ్రరూపం దాల్చనున్నాయని భారత వాతావరణ కేంద్రం ప్రకటించడంతో నగరంలో వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చెన్నై కార్పొరేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆ మేరకు వరదనీటిలో చిక్కుకునేవారిని కాపాడేందుకుగాను 36 పడవలను కొనుగోలు చేసింది. స్థానిక జాలర్ల నుంచి మరో 80 పడవలను తెప్పించింది. గురువారం రెండు పడవలను మాధవరం, పెరుంగుడి ప్రాంతాలకు లారీల్లో తరలించారు. ఇక వరద బాధితులు, వర్షబాధితులకు తాత్కాలిక బస కల్పించేందుకు సహాయక శిబిరాలు, తాగునీటి ట్యాంకర్లు, జనరేటర్లు, వంటగదులను కూడా సిద్ధం చేసి ఉంచారు. నగరంలో వర్షపునీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు భారీ పంపుసెట్లను కూడా జోనల్ కార్యాలయాలకు తరలిస్తున్నారు. ఇక వర్షబాధితులు, వరదబాధితులకు సహాయక చర్యలు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి సేవలందించాలనుకునే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, కార్యకర్తలు https://gccservices.chennaicorporation.gov.in/volunteer అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

శ్రీవారి గొడుగులకు పూజలు

ప్యారీస్, అక్టోబరు 3: స్థానిక తిరునింద్రవూర్‌లోని శ్రీమద్ రామానుజ కైంకర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారికి సమర్పించనున్న 12 గొడుగులకు గురువారం టి.నగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.దినేష్ కుమార్, నిర్వాహకులు మాధవనాయుడు, ఎంజీ లక్ష్మీపతి, ఎంజీ మోహన్, మనోహరన్, ఆర్.రవి తదితరుల సమక్షంలో టీటీడీ ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సుమతి, పాలక మండలి మాజీ అధ్యక్షులు ఎన్.శ్రీకృష్ణ, ఆనందకుమార్ రెడ్డి, మాజీ సభ్యులు కె.అనీల్‌కుమార్ రెడ్డి, మోహనరావు, ఎం.రవిబాబు, ఊరా లక్ష్మీనరసింహారావు, సుదర్శనం, జయదేవ్, మాజీ బోర్డు సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి గోవింద నామస్మరణల మధ్య గొడుగులను ప్రత్యేక వాహనం ద్వారా తిరుమలకు తరలించారు.



శ్రీవారి ఆలయం నుంచి తిరుమలకు బయల్దేరిన గొడుగులు

రైలు పట్టాలో పగుళ్లు

తప్పిన ప్రమాదం ● రైళ్ల రాకపోకలకు అంతరాయం



విరిగిన రైలు పట్టా

వేలూరు, అక్టోబరు 3: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని పులియమంగళం వద్ద రైలు పట్టాల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. గురువారం ఉదయం దీనిని రైల్వే ఉద్యోగి గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా వున్నాయి... ఉదయం 8.50 గంటల ప్రాంతంలో తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ పులియమంగళం వైపు వచ్చింది. అదే సమయంలో రైలు పట్టాల్లో పగుళ్లు ఏర్పడివుండం గమనించిన రైల్వే ఉద్యోగి ఎర్ర జెండా చూపుతూ రైలు ఆపేందుకు ప్రయత్నించారు. చివరి క్షణంలో గమనించిన లోకోపైలట్ రైలు ఆపేందుకు ప్రయత్నించినా రైలు ఇంజన్, రిజర్వేషన్ బోగి, ఏసీ బోగీలు పెద్ద శబ్దంతో ఆ పగుళ్లు దాటి వెళ్లాయి. భారీ శబ్దం రావడంతో ఎస్-1లో వున్న ప్రయాణికులు చైన్ లాగారు. దీంతో రైలు ఆగింది. రైలు ఆగాక డ్రైవర్, గార్డ్ వెళ్లి తనిఖీ చేయగా పట్టాలపై పగుళ్లు కనిపించాయి. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి రైలు అక్కడే నిలిపేశారు. అరక్కోణం, పెరంబూరు నుంచి వచ్చిన సిబ్బంది పగుళ్లను సరి చేసిన తరువాత నిధానంగా రైలు బయలుదేరింది. దీంతో ఆ మార్గంలో పలు రైళ్ల రాకపోకల్లో జాప్యం ఏర్పడింది.

ఎయిర్‌షోకు ప్రధాని

● నేడు రిహార్సల్స్

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళ దినోత్సవం సందర్భంగా మెరీనా తీరంలో ఈ నెల 6న వైమానిక దళం తన సత్తా చాటేలా అట్టహాసంగా ఎయిర్ షో నిర్వహించనుంది. దీనికి సంబంధించి శుక్రవారం ఉదయం 11 గంటలకు భారీ స్థాయిలో రిహార్సల్స్ జరుపనుంది. వివిధ రకాలకు చెందిన 72 విమానాలు ఈ ముందస్తు ప్రదర్శనలో పాల్గొనున్నాయి. కాగా 6న నిర్వహించనున్న ఎయిర్ షోను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు వీక్షించడానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ కూడా రానున్నారు. సుమారు లక్షమందికి పైగా ఈ విన్యాసాలు తిలకించేందుకు అనువైన ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు. 2003 తర్వాత మళ్ళీ నగరంలో ఈ ఎయిర్ షో నిర్వహించడానికి వైమానిక దళ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. మెరీనాలో తాత్కాలిక కంట్రోలింగ్ రూంలను ఏర్పాటు చేశారు. ఈ ఎయిర్‌షో ఆదివారం నిర్వహించనుండటంతో వీక్షకుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి ఎనిమిదివేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. 2003లో జరిగిన ఎయిర్‌షో ముగిసిన తర్వాత నగరంలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. అలాంటి పరిస్థితి మళ్ళీ రాకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసు అధికారులు కూడా చర్యలు చేపడుతున్నారు.



డకోటా నుంచి రఫేల్ విమానాల వరకు..

ఈ ఎయిర్‌షోలో పాత రకం డకోటా మాడల్ నుంచి నేటి రఫేల్ మాడల్ వరకు వివిధ విమానాలు పాల్గొననున్నాయి. షోలో ఆకాష్ గంగా పారాచూట్ బృందం ప్రదర్శన అబ్బురపరుస్తాయి. సూర్యకిరణ్ ఏరోబేటిక టీమ్ విమానాలు కూడా చూపరులకు కనువిందు చేస్తాయి. సారంగ్ టీమ్ హెలికాప్టర్లు, ఎల్‌సీ హెచ్ బృందం హెలికాప్టర్ల ద్వారా తేలికపాటి దాడులు జరిపే విన్యాసాలు ప్రదర్శించనున్నారు. ఇదే రీతిలో తేజాస్, చేతక్, హెచ్‌టీటీ-40 విమానాలు, రఫేల్ తదితర యుద్ధ విమానాలు, మెరీనాతీరం సాక్షి గా ప్రదర్శించనున్నాయి.

ముత్తారమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు

● కులశేఖరపట్టినంలో అట్టహాసంగా వేడుకల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో జ్ఞానమూర్తీశ్వరుడు, ముత్తారమ్మన్ (ఇన్‌సెట్‌లో) కాళికాదేవి వేషంతో రిహార్సల్ చేస్తున్న కళాకారులు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఉడన్‌కుడి సమీపంలో సముద్రతీర నగరం కులశేఖరపట్టినంలోని జ్ఞానమూర్తీశ్వర సమేత ముత్తారమ్మ ఆలయం లో దసరా వేడుకలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం కాళికాదేవి పూజ, అన్న సంతర్పణ తదితర కార్యక్రమాలు, రాత్రి 9 గంటలకు అమ్మవారికి కంకణధారణ మహోత్సవం జరిగాయి. గురువారం వేకువజాము ఐదుగంటలకు అందంగా అలంకరించిన ఏనుగుపై ధ్వజ పతాక ఊరేగింపు ప్రారంభమైంది. నగరంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు పూర్తయిన తర్వాత ఉదయం 9.30 గంటలకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆలయ ప్రధానార్చకులు ఆలయం ఎదుటనున్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. ఈ వేడుకలకు గాను వేలాదిమంది భక్తులు సముద్రతీరంలో పుణ్యస్నానమాచరించి 'ఓం కాళి, జై కాళీ' అంటూ నినాదాలు చేస్తూ పవిత్ర జలాలను ఆలయానికి మోసుకొచ్చారు. ఆలయం వద్దనున్న కళైఅరంగంలో శివలూరు దసరా కమిటీ ఆధ్వర్యంలో సముద్రతీరంలో సందడియార్ దసరా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ దసరా వేడుకల్లో కళైఅరంగంలో రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ధ్వజారోహణం తర్వాత ఆలయ పూజారి వ్రతమాచరించిన భక్తులకు కంకణధారణ చేశారు. గురువారం రాత్రి 10 గంటలకు ముత్తారమ్మన్ దుర్గాదేవి అలంకారంలో సింహవాహనంలో ఊరేగారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అరాధన నిర్వహించనున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఈ నెల 4న విశ్వకర్మ అలంకారంలో కల్పవృక్షవాహనంలో, 5న పార్వతి అలంకారంలో వృషభవాహనంలో, 6న బాలసుబ్రహ్మణ్యం అలంకారంలో మయూర వాహనంలో, 7న నవనీతకృష్ణుడి అలంకారంలో కామధేను వాహనంలో ఊరేగనున్నారు. 8న మహిషాసురమర్దిని అలంకారంలో సింహవాహనంలో, 9న ఆనంద నటరాజ అలంకారంలో పంచసప్పరాల్లో, 10న గజలక్ష్మి అలంకారంలో కమలవాహనంలో, 11న కళైమగళ్ అలంకారంలో హంసవాహనంలో ఊరేగి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ నెల 8న రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 30 వేలకు పైగా దసరా కమిటీ సభ్యులు కంకణ ధారణతో విచిత్రమైన దేవతమూర్తుల వేషాలు, మేళ తాళాలతో కరగాట్టం, మయిలాట్టమ్, డిస్కో నాట్యంతో సందడి చేయనున్నారు. అదే సమయంలో తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లోనూ దసరా కమిటీ సభ్యులు వేషధారణతో దసరా వేడుకల్లో పాల్గొంటారు.



ధ్వజారోహణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

12న మహిషాసుర సంహారం...

ఈ వేడుకల్లో అత్యంత కీలకమైన మహిషాసూరసంహారం ఈ నెల 12 రాత్రి 11 గంటలకు జరుగుతాయి. రాత్రి 12 గంటలకు ముత్తారమ్మన్ సింహవాహనంలో బయలుదేరి సముద్రతీరంలో మహిషాసురుడిని సంహరించనున్నారు. మరుసటి రోజు అర్ధరాత్రి ఒంటిగంటలకు సముద్రతీరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమ్మవారికి అభిషేకం జరుగుతుంది. వేకువజాము రెండు గంటలకు చిదంబరేశ్వరాలయంలో అమ్మవారికి శాంతాభిషేక ఆరాధన అనంతరం రథారూఢురాలై ఆలయం వద్దనున్న కళై అరంగానికి చేరుకుంటారు. ఉదయం 6 గటలకు ముత్తారమ్మన్ అమ్మవారు పంచసప్పరంపై నగర వీధుల్లో ఊరేగనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారు గర్భాలయానికి చేరుకోగానే సాయంత్రం 4.30 గంటలకు ధ్వజావరోహణంతో ఈ వేడుకలు ముగియనున్నాయి.

చెన్నై నుంచి జెడ్డాకు విమానాలు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై - జెడ్డా విమాన సేవలు నాలుగేళ్ల విరామం తర్వాత మళ్ళీ ప్రారంభమయ్యాయి. కొవిడ్ కారణంగా 2020 మార్చిలో ఈ రెండు నగరాల నడుమ విమాన సేవలు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి సౌదియా ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో చెన్నై - జెడ్డా విమాన సేవలు ప్రారంభమయ్యాయి. వారంలో రెండు రోజులు చొప్పున సోమ, బుధవారాల్లో చెన్నై నుంచి జెడ్డాకు ఈ విమానం వెళ్తుంది. ఈ విమానంలో జెడ్డా నగరానికి వెళ్లటానికి ఐదున్నర గంటల సమయం పడుతుంది. ప్రయాణికుల స్పందన ప్రకారం ఈ విమాన సర్వీసును వారానికి మూడు రోజులు నడిపే యోచన కూడా ఉందని సౌదియా ఎయిర్ లైన్స్ అధికారులు పేర్కొన్నారు.



'టాస్మాక్' కుదింపు?

● మద్యం దుకాణాల తగ్గింపుపై ప్రభుత్వం కసరత్తు

● 8న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం?

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యపాన నిషేధంపై నలువైపుల నుంచి వస్తున్న ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గుతోందా?.. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని దుకాణాలను తగ్గించడంపై కసరత్తు చేస్తోందా?.. ఈ నెల 8వ తేదీ జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో 'కీలక నిర్ణయం' తీసుకోనున్నారా?.. అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. ముఖ్యమంత్రి స్టాలిన్ అభీష్టం మేరకు కనీసం 500 దుకాణాలను తగ్గించే యోచనలో ప్రభుత్వం వున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సీఎం స్టాలిన్ నేతృత్వంలో ఈ నెల 8వ తేదీ మంత్రివర్గ సమావేశం జరుగనున్న విషయం తెలిసిందే. ఉదయనిధి ఉపముఖ్యమంత్రిగా, మంత్రివర్గ విస్తరణ తరువాత జరుగనున్న ఈ తొలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మత్తు పదార్థాల నిర్మూలన, మద్యపాన నిషేధంపై నలువైపుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్న తరుణంలో.. మద్యం దుకాణాలు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని గురించి మంత్రివర్గ విస్తరణలో చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో 4,829 మద్యం దుకాణాలున్నాయి. ఇందులో ఎఫ్ఎల్-2, ఎఫ్ఎల్-3 షాపులు 1685 వున్నాయి. ఇవి గాక 400 వైన్ షాపులకు అనుమతి కోరుతూ వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లోనే వున్నాయి. ఈ సందర్భంగాలో 500 మద్యం దుకాణాలను మూసివేయడంపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. రాష్ట్రంలో మద్య నిషేధం కావాలని పలు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉండగా డీఎంకే సైతం మద్యం దుకాణాలను తీసేయాలని, వంతుల వారీగా మద్య నిషేధం చేపట్టాలని డిమాండ్ చేసింది. బుధవారం ఉళుందూర్‌పేటలో డీపీఐ నేతృత్వంలో జరిగిన మద్యపాన నిర్మూలన మహానాడు కూడా ఇదేవిధమైన డిమాండ్ చేసింది. ఇక ప్రతిపక్ష అన్నాడీఎంకే అయితే మద్యపాన నిషేధంపై డీఎంకే ప్రభుత్వం మాట తప్పిందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందంటూ దుమ్మెత్తిపోస్తోంది. పీఎంకే అయితే ఆదినుంచే మద్యపాన నిషేధం కోసం డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్ని జిల్లాల్లో అవగాహనా సమావేశాలు జరుపుతోంది. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా అనేకమంది గళమెత్తుతుండడంతో కొన్ని దుకాణాలనైనా మూసివేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలిసింది. అంతేగాక మంత్రివర్గ సమావేశంలో ... మహిళలకు రూ.1000, పుదుమైపెణ్, తమిళ్ ముదల్వాన్ పథకాలకు సంబంధించి కూడా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

1న రూ.220 కోట్లకు మద్యం విక్రయాలు

జాతిపిత గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీ మద్యం దుకాణాలు మూసివేసిన విషయం తెలిసిందే. అయితే మద్యంపై ముందుగానే మేల్కొన్న మందుబాబులు ఒక్కరోజు ముందుగా మద్యం కొనుగోలు చేశారు. దీంతో ఈ నెల 1వ తేదీ ఒక్కరోజే రూ.220 కోట్లకు మద్యం విక్రయాలు జరిగాయి. రాష్ట్రంలో రోజురోజుకు మద్యం విక్రయాలు పెరుగుతున్నాయి. పండుగ రోజుల్లో వీటికి హద్దే లేకుండాపోతోంది. 1వ తేదీ చెన్నై మండలంలో రూ.53 కోట్లకు, కోయంబత్తూరు మండలంలో రూ.39 కోట్లు, మదురై మండలంలో రూ.43 కోట్లు, తిరుచ్చి మండలంలో రూ.41 కోట్లు, సేలం మండలంలో రూ.38 కోట్లకు విక్రయాలు జరిగాయి. అయితే 2023 అక్టోబరు 1వ తేదీన రూ.245 కోట్లకు మద్యం అమ్మకాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25 కోట్లు అమ్మకాలు తగ్గినట్లుగా అధికారులు లెక్కలు తేల్చారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో చార్జిషీటు దాఖలు

● ఏ1గా నాగేంద్రన్, ఏ2గా సంబవ సెంథిల్



ఆర్మ్‌స్ట్రాంగ్ (ఫైల్‌ఫొటో)

అడయార్, అక్టోబరు 3: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో నగర పోలీసులు చార్జిషీటు తయారు చేసి గురువారం ఎగ్మోర్ కోర్టులో సమర్పించారు. మొత్తం 5 వేల పేజీలతో రూపొందించిన ఈ చార్జిషీటులో ఏ1గా రౌడీ నాగేంద్రన్, ఏ2గా సంబవ సెంథిల్, ఏ3గా అశ్వత్థామన్‌లను చేర్చారు. వీరిలో సంబవ సెంథిల్‌ను అరెస్టు చేయాల్సి ఉంది. అతడికోసం ప్రత్యేక పోలీస్ బృందం గాలిస్తోంది. పెరంబూరుకు చెందిన ఆర్మ్‌స్ట్రాంగ్ (55)ను జూలై 5వ తేదీన ఆయన ఇంటి సమీపంలోనే ఓ ముఠా దాడి చేసి హత్య చేసిన విషయం తెల్సిందే. ఈ కేసులో పోలీసులు మొత్తం 28 మంది నిందితులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిలో తిరువేంగటం అనే నిందితుడు ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. దీంతో అప్పటి నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్‌పై బదిలీ చేశారు. ఆ తర్వాత నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరుణ్.. ఈ కేసులో 90 రోజుల్లోనే చార్జిషీట్ తయారు చేసి కోర్టుకు సమర్పిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత కేసు విచారణ కోసం జాయింట్ కమిషనర్ విజయకుమార్ సారథ్యంలో ముగ్గురు అసిస్టెంట్ కమిషనర్లు, పదిమంది సీఐలతో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు రంగంలోకి దిగి... ఈ కేసుతో సంబంధం ఉన్న నిందితులందరినీ అరెస్టు చేశారు. అయితే, ఈ హత్య కేసుకు రూ.50 లక్షలు సమకూర్చిన సంబవ వెంకటేష్ సహా మొట్టై కృష్ణన్‌లను మాత్రం ఇప్పటివరకు అరెస్టు చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో కమిషనర్ అరుణ్ ముందుగా చెప్పినట్టుగానే గురువారం సెంబియం పోలీసులు ఎగ్మోర్ కోర్టులో చార్జిషీటు సమర్పించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ కేసులో 90 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేయడంతో ఈ కేసు విచారణ కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

సమాచార దర్శిని

నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలిలా ...

టైడల్ పార్క్: తరమణి, కానగం, పెరియార్‌నగర్, తిరువాన్మియూరు, ఇందిరానగర్, ఎంజీఆర్ నగర్, వేళచ్చేరి, వీఎస్ఐ ఎస్టేట్ నుంచి హండ్రెడ్‌ఫీట్ రోడ్డు ప్రాంతం, అన్నానగర్, సీఎస్ఐఆర్ రోడ్డు, ఆర్ ఎంజెడ్ మిలీనియం, సీపీఆర్ పార్కు, అసెండెస్, టైడల్ పార్క్, గాంధీనగర్, అడయార్ ప్రాంతం

రాజకీల్పాక్కం: డెలస్ అవెన్యూ ఫేస్ 1, 2, అబ్దుల్ కలాం నగర్, సత్యసాయి నగర్, పొన్నియమ్మన్ కోయిల్ వీధి, రాజేశ్వరి నగర్, అలవట్టమ్మన్ కోయిల్ వీధి, అరుళ్‌నిధి నగర్ ఎక్స్‌టెన్షన్, గోకుల్ నగర్, రాదేశం అవెన్యూ, జయేంద్ర నగర్ మెయిన్,

నాప్పాళయం: మనలి న్యూ టౌన్, విచ్చూర్, సిడ్కో ఎస్టేట్, కుళక్కరై, ఐజీ పురం, ఎళిల్ నగర్, గణపతి నగర్, శ్రీరాంనగర్, అరుళ్‌మురుగన్ నగర్, వెళ్లివయల్, నాప్పాళయం, ఇడయంచావడి, వెళ్లివయల్ చావడి, కొండక్కరై, ఎక్కల్ కాలనీ, పొన్నియమ్మన్ నగర్, సెమ్మనలి, ఎంఆర్ఎఫ్ నగర్, సుబ్రమణి నగర్

మాంగాడు: కొళుమణివాక్కం, నెల్లితోప్పు మహాలక్ష్మీనగర్, తిరుప్పది నగర్, మారుతి నగర్, జనని నగర్, గురు అవెన్యూ, శ్రీనివాసనగర్, మాసిలామణి నగర్, మేల్మానగర్, మల్లిగానగర్, చార్లెస్ నగర్, శబరి నగర్, రాజీవ్ నగర్, అమ్మన్ నగర్, లక్ష్మీ నగర్, కుండ్రత్తూరు మెయిన్‌రోడ్డు, కేకే నగర్, అన్నావీధి, గోవిందరాజ నగర్, అలెక్స్ నగర్, ఎస్ఎస్‌కే అవెన్యూ, ముత్తుకుమరన్ కాలేజ్.

చెత్త పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలోని బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసే వారిని పట్టుకునేందుకు కార్పొరేషన్ ఐదు బృందాలను నియమించింది. 18 వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. త్వరలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమవుతున్నందున బహిరంగ ప్రదేశాలు, నీరు నిలబడే ప్రాంతాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు కార్పొరేషన్ చర్యలు చేపడుతోంది. అయినా కొన్ని ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సిమెంట్ వ్యర్థాలు, చెత్త వేస్తున్నారు. దీనిని అడ్డుకునేందుకు అధికారులు నిబంధనల్ని కఠినతరం చేయడమే గాక, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆ మేరకు చెన్నై కార్పొరేషన్ నిబంధనల్ని సవరించింది. అంతేగాక చెత్త వేసేవారిని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా 5 బృందాలను నియమించింది. ఈ బృందాలు చెత్త వేయకుండా పర్యవేక్షిస్తాయి.

45 ఏళ్ల తరువాత రోగులకు నాన్‌వెజ్ విందు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కీల్పాక్‌లో వున్న ప్రభుత్వ మెంటల్ ఆస్పత్రి రోగులకు 45 ఏళ్ల తరువాత మాంసాహార విందు అందింది. ఈ ఆసుపత్రి 225 ఏళ్లకు పైగా నడుస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ 772 మంది మానసిక రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో 45 ఏళ్ల తరువాత తొలిసారిగా బుధవారం రోగులకు మాంసాహార విందు అందింది. దీని గురించి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎం.మలయమ్మన్ మాట్లాడుతూ..ఈ ఆసుపత్రిలో 1980కు ముందు మాంసాహార భోజనం పెట్టేవారని, ఆ తరువాత వివిధ కారణాలతో నిలిపేశారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సుప్రియ ఆదేశాల మేరకు రోగులకు మాంసాహారం అందించారు. ఇకపై ఇది కొనసాగుతుందని వివరించారు.

నేడు టీవీకే మహానాడుకు అంకురార్పణ

ప్యారీస్, అక్టోబరు 3: సినీనటుడు దళపతి విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి రాజకీయ మహానాడు ఈ నెల 27న విల్లుపురం జిల్లా విక్రవాండిలో జరుగనున్న నేపథ్యంలో, వేదిక ప్రాంగణం నిర్మాణానికి సంబంధించిన స్తంభ స్థాపన శుక్రవారం జరుగనుంది. ఈ వేడుకల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నిర్వాహకులు పాల్గొని విజయవంతం చేయాలని విజయ్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, వేదిక ఏర్పాట్లపై టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ... విక్రవాండి పరిధిలో నిర్వహించనున్న మహానాడు స్తంభ స్థాపన పూజలు శుక్రవారం జరుగుతాయని, పార్టీ అధ్యక్షుడు విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ప్రాచీన క్రీడలపై ప్రపంచ రికార్డు సాధన





సాధనను ప్రారంభిస్తున్న రాజేంద్రన్ తదితరులు - రికార్డు సాధనలో విద్యార్థులు

వేలూరు, అక్టోబరు 3: 'నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సాధన కోసం వేలూరు జిల్లా కాట్పాడిలో వున్న ప్రభుత్వ క్రీడా మైదానంలో బుధవారం సాయంత్రం ప్రయత్నం జరిగింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఈ సాధనను ప్రారంభించారు. ప్రాచీన సంప్రదాయ క్రీడలు, కళలైన సిలాంబాట్టం, నెమలి ఆట్టం, భరతనాట్యం తదితర 7 రకాల విన్యాసాలు జరగ్గా, ఇందులో వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, రాణీపేట, కాంచీపురం తదితర జిల్లాలకు చెందిన 6 వేల మంది విద్యార్థినులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, చిన్నారుల లైంగిక దాడుల నిర్మూలన, రోడ్డు భద్రతపై అవగాహన వంటివాటిపై 35 నిమిషాల పాటు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ సాధన చేశారు. జిల్లా మాజీ కలెక్టర్ రాజేంద్రన్, అన్నాడీఎంకే నేత అప్పు, న్యాయవాద సంఘం అధ్యక్షుడు బాలచందర్ తదితరులు పాల్గొన్నారు. సాధన ఫలితాన్ని త్వరలోనే వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు.

గాంధీ జయంతి రోజున సెలవివ్వని సంస్థలకు జరిమానా

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ సెలవు దినమైన గాంధీ జయంతి నాడు చెన్నైలోని దుకాణాలు, సంస్థల యజమానులకు అధికారులు జరిమానా విధించారు. చెన్నై డిప్యూటీ కమిషనర్ విమలనాధన్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషర్ ఆధ్వర్యంలో చెన్నైలోని 254 దుకాణాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఇందులో 194 చోట్ల సెలవు ఇవ్వకుండా సిబ్బంది చేత పని చేయిస్తున్నట్లు తేలింది. 223 హోటళ్లలో తనిఖీ చేయగా 183 చోట్ల నిబంధనలు అతిక్రమించినట్లు తేలింది. ఇలా సెలవు ఇవ్వకుండా పని చేయించిన సంస్థల యజమానులకు భారీగా జరిమానా విధించారు.

ఈపీఎస్ ఆదేశిస్తే ప్రచారం చేస్తా

● విజయ్ ప్రభాకరన్



చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆదేశిస్తే రాష్ట్ర మంతా కూటమి తరఫున ప్రచారం, పార్టీ కార్యక్రమాలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, డీఎండీకే మాజీ అధ్యక్షుడు, దివంగత విజయకాంత్ తనయుడు విజయ్ ప్రభాకరన్ పేర్కొన్నారు. తేని జిల్లా పెరియకుళంలో జరిగిన డీఎండీకే ద్వాదశ వార్షికోత్సవాల సభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో 40 స్థానాలు గెలుచుకున్నట్లు డీఎంకే చెబుతోందని, వాస్తవానికి 21 స్థానాల్లోనే ఆ పార్టీ గెలిచిందని, తక్కిన 19 స్థానాల్లో మిత్రపక్షాలు వాటికి ఉన్న ఓటు బ్యాంక్ ద్వారా గెలిచాయన్నారు. విజయకాంత్‌ని ప్రసార మాధ్యమాలన్నీ హేళనగా చూశాయని, ఆయన కన్నుమూశాకే రాష్ట్ర ప్రజలంతా సుగుణవంతుడని, దానకర్ణుడని పొగడ్తుండటం చూసి విస్తుపోయానని విజయ్ ప్రభాకరన్ అన్నారు. శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, డీఎండీకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

వేలూరు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్



వేలూరు, అక్టోబరు 3: వేలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ సెల్ జరిగింది. ఎస్పీ మదివానన్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించడంతో పాటు పలు సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చూపారు. ఒక్కరోజులోనే 200 వినతిపత్రాలు రాగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

తిరుమావళవన్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

అడయార్, అక్టోబరు 3: మాజీ గవర్నర్, బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను లక్ష్యంగా చేసుకుని వీసీకే ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ ఖండించారు. ఇదే విషయంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీసీకే ఆధ్వర్యంలో జరిగిన మద్య, డ్రగ్స్ నిషేధ మహానాడులో తమిళిసైను ఉద్దేశించి తిరుమావళవన్ ప్రసంగిస్తూ 'అక్క.. తమిళిసై మద్యం సేవించరు' అని నమ్ముతున్నానన్నారు. ఈ వ్యాఖ్యలను తమిళిసైను కించపరిచేలా ఉన్నాయని పేర్కొంటూ, తమ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోర్టు ప్రాంగణాల్లో 'స్వచ్ఛతా హి సేవా'



వేలూరు, అక్టోబరు 3: వేలూరులోని కాట్పాడి, గుడియాత్తం కోర్టు ప్రాంగణాల్లో గురువారం 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో పారిశుధ్య పనులు జరిగాయి. పలు చోట్ల మొక్కలు నాటారు. జిల్లా న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు కూడా పాల్గొన్నారు.

మహిళలను కించపరిచిన వ్యక్తి అరెస్టు

పుదుచ్చేరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నగ్నంగా నిలబడి మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిని పుదుచ్చేరి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక మేట్టుపాళెయం ప్రాంతానికి చెందిన రవికుమార్ అనే వ్యక్తి బుధవారం తన ఇంటిముందు ఒంటిపై నూలుపోగు లేకుండా నిలబడి పిలవడం ప్రారంభించాడు. దీంతో అటుగా వెళ్ళిన మహిళలు భయంతో పరుగులు తీశారు. ఈ విషయం పోలీసులకు చేరింది. హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు... రవికుమార్‌ను అరెస్టు చేశారు.

బ్యాటరీతో నడిచే సైకిల్

● సేలం విద్యార్థికి మంత్రి అన్బిల్ ప్రశంస





బ్యాటరీ సైకిల్ తయారు చేసిన అభిషేక్ అతడి తల్లిదండ్రులు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయం ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అభిషేక్ బ్యాటరీతో నడిచే సైకిలు తయారు చేశాడు. ఆ సైకిల్ పైనే రోజూ స్కూల్‌కు వెళ్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆ బాలుడికి ఫోన్ చేసి మెచ్చుకున్నారు. చిన్న వయస్సులోనే ఇలా కొత్త కొత్త పరిశోధనలు చేసి సైంటిస్టుగా ఎదగాలని మంత్రి సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వేలూరు, అక్టోబరు 3: వేలూరు కార్పొరేషన్‌లో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి గురువారం పరిశీలించారు. వేలూరు - కాట్పాడి రోడ్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు, తరువాత వేలూరు కార్పొరేషన్ ధారపడవేడులోని పారైమేడు ప్రాంతంలో దోమల మందు పిచికారీ పనులను కూడా పరిశీలించారు. కలెక్టర్ వెంట సూపర్‌వైజర్ పార్వతి, నీటిపారుదల శాఖ ఇంజనీర్ నిత్యానందం తదితర ఉన్నతాధికారులున్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ



వేలూరు, అక్టోబరు 3: వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో గురువారం ఎయిడ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞా కార్యక్రమం జరిగింది. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ కంట్రోల్ అధికారి చిత్రా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చెన్నై అంబత్తూరు ఆవిన్ డైరీని పరిశీలిస్తున్న పాడిపరిశ్రమల శాఖ మంత్రి ఆర్ఎస్.రాజకన్నప్పన్

జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు




భక్తిగీతాలు ఆలపిస్తున్న అరుణా శ్రీనాథ్, మణిమాలరావు

ప్యారీస్, అక్టోబరు 3: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళ్యం సమీపం ఆర్యపాక్కంలో ఉన్న విద్యారంభ జ్ఞానమహా సరస్వతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, హోమం, అభిషేకం, అమ్మవారికి అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును ఆలయ ధర్మకర్త పీవీ కృష్ణారావు, మణిమాలరావు దంపతులు ప్రారంభించారు. ముందుగా ప్రముఖ గాయకురాలు ఎడవల్లి అరుణా శ్రీనాథ్ గణపతి ప్రార్థన చేసి, 'నవదుర్గా స్వరూపిణి...', 'తల్లివి సరస్వతి...' తదితర అమ్మవారి కీర్తనలు సహ గాయకులతో కలిసి ఆలపించారు. తొలిరోజు అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులందరికి ప్రసాదాలు, ముత్తయిదువులకు పసుపు కుంకుమలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు.

నగరంలో విజృంభిస్తున్న డెంగ్యూ

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు, ప్రత్యేకించి ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాలు ప్రారంభమవుతున్న సమయంలో డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతూ రోజూ ఐదువేలమందికిపైగా నగరవాసులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. మొదట తేలికపాటి జ్వరంతో బాధపడుతున్న వీరిని మూడు రోజులపాటు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించినమీదట జ్వరం తగ్గకపోతే వైద్యపరీక్షలు చేస్తున్నారు. అందులోనే డెంగ్యూ లేదా చికెన్ గున్యా జ్వరం వచ్చినట్లు నిర్ధారణ చేస్తున్నారు. చికెన్ గున్యా, డెంగ్యూ జ్వరాలకు యాంటీ బయాటిక్ మందులు లేవు. అందువల్ల కాంప్లిమెంటరీ మందులు మాత్రమే ఇస్తున్నారు. జ్వరం నయమైన తర్వాత కూడా వంటి నొప్పులతో బాధపడుతున్నారు. చికెన్‌గున్యాతో బాధపడుతున్న సెల్వం అనే రోగి మాట్లాడుతూ జ్వరంతో వరుసగా నాలుగైదు రోజులపాటు అవస్థలు పడ్డానని, ఆ తర్వాత జ్వరం తగ్గినా వంటి నొప్పులు పోలేదని చెప్పారు. ఈ విషయమై వైద్యనిపుణులు మాట్లాడుతూ తేలికపాటి జ్వరం, జలుబు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదని ఒకటి రెండు రోజులు ఐసోలేషన్‌లో ఉంటే చాలని చెబుతున్నారు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నవారు, ప్రత్యేకించి వృద్ధులు, చిన్న పిల్లలు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. బీపీ, శ్వాస, మూత్రాశయ సమస్యలు, మధుమేహంతో బాధపడుతున్నవారు ఈ జ్వరాల బారినపడితే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని హెచ్చరించారు. జ్వరంతో బాధపడుతున్నవారితో ఇతరులు దూరంగా ఉండాలన్నారు. పండ్లు, కాయగూరలు వంటి పుష్టికరమైన ఆహారం భుజించాలన్నారు. ఈ జ్వరాలతో బాధపడుతున్నవారు మందులు వాడాల్సిన అవసరం లేదని, వేటినీటి ఆవిరి పడితే చాలని సిద్ధవైద్యులు చెబుతున్నారు. ఇంటి పట్టునే రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే మంచిదన్నారు. తులసి ఆకులు, కర్పూరవల్లి ఆకులు తింటే శ్రేష్ఠమని అన్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ



మంత్రి ఎం సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇవి సీజన్ జ్వరాలని వీటిని నయం చేయడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులున్నాయని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి నగరవాసులకు ఉచితంగా మందులు కూడా ఇస్తున్నామని చెప్పారు.

తిరుచ్చిలో ఏడు పాఠశాలలకు బాంబు బెదిరింపు



తిరుచ్చి ప్రైవేటు కాలేజీలో తనిఖీకి వెళుతున్న బాంబ్ స్క్వాడ్

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో ఏడు పాఠశాలలు, ఓ కళాశాలకు ఈ మెయిల్ సందేశాల ద్వారా బాంబు బెదిరింపులు రావటంతో పోలీసులు బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్ళి తనిఖీలు చేశారు. చివరకు అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని తెలుసుకుని ఊరట చెందారు. తొలుత తిరువెరుంబూరు కాట్టూరులో మాన్‌ఫోర్డ్ మహోన్నత పాఠశాలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదరింపు వచ్చింది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంటలోగా పాఠశాలలో పెట్టిన బాంబు పేలుతుందని బెదరించారు. వెంటనే పాఠశాల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాంబ్‌స్క్వాడ్, జాగిలాలతో వెళ్ళి తనిఖీలు చేశారు. అదే సమయంలో తిరుచ్చిలోని హోలీ క్రాస్ స్కూల్, కళాశాల, కేంబియన్ స్కూల్, సమదు మహోన్నత పాఠశాల, కేకే నగర్ ఆచార్యా స్కూల్, పునిద వళ్లలార్ పాఠశాల సహా ఏడు పాఠశాలలకు కూడా బాంబు బెదరింపులు వచ్చాయి. వీటిలో కొన్ని స్కూళ్లకు త్రైమాసిక సెలవులు కావటంతో ఆ పాఠశాలల్లో విద్యార్థులు లేరు. అయినా పోలీసులు ఆ పాఠశాలల్లో తనిఖీ చేశారు. ఈ బాంబు బెదరింపులు శ్వేతా బాలకృష్ణన్ అనే పేరుతో వచ్చాయని పోలీసు అధికారులు తెలిపారు.

ఒకే సిరంజితో పలువురికి ఇంజెక్షన్లు

● నర్సు సస్పెన్షన్

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై ప్రభుత్వాసుపత్రిలో కొద్ది రోజుల క్రితం ఒకే సిరంతో అనేకమందికి రోగులకు ఇంజెక్షన్లు వేసిన నర్సును అధికారులు సస్పెండ్ చేశారు. తన వద్దకు వచ్చిన రోగులందరికీ అదే సిరంజితో ఆ నర్సు ఇంజెక్షన్లు చేసింది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన జిల్లా కలెక్టర్ మహాభారతి ఆ నర్సును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధానోపాధ్యాయుడి ఇంటిలో బంగారం చోరీ

అడయార్, అక్టోబరు 3: దిండిగల్ జిల్లాలోని ఒక ప్రధానోపాధ్యాయుడు నివాసంలో 100 సవర్ల బంగారం చోరీకి గురైంది. జిల్లాలోని పళని రోడ్డు, నయినార్ మహ్మద్ వీధికి చెందిన సవరిముత్తు రెడ్డియార్ సత్రం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆయన తన కుమార్తె వివాహం కోసం వంద సవర్ల బంగారం నగలు కొనుగోలు చేసి ఇంటిలో భద్రపరిచారు. బుధవారం పెళ్ళి దుస్తులు కొనుగోలు చేసేందుకు కుటుంబ సభ్యులంతా షాపింగ్‌కు వెళ్ళారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు నగలను చోరీ చేశారు. షాపింగ్ చేసి ఇంటికి వచ్చిన సవరిముత్తు కుటుంబ సభ్యులు ఇంటిలో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి కుప్పకూలిపోయారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

సెంట్రల్ సిగ్నల్ టవర్‌పై ఎక్కి ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



ఆటో డ్రైవర్ ప్రకాష్‌తో చర్చలు జరుపుతున్న పోలీసులు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసులు తనపై నమోదు చేసిన ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసు రద్దు చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్ సెంట్రల్ స్టేషన్ వద్ద సిగ్నల్ టవర్‌పై ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నగరంలోని పల్లవన్ సాలై ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ప్రకాష్ బుధవారం నో పార్కింగ్ ప్రాంతంలో ఆటో నిలిపి ఉంచడంతో రైల్వే పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని జరిమానా విధించి కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం ప్రకాష్ ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్‌కు వెళ్ళి తనపై నమోదు చేసిన కేసు రద్దు చేయాలని కోరాడు. రైల్వే పోలీసులు కేసును రద్దు చేయలేమని తెలిపారు. దీంతో ప్రకాష్ ఆర్పీఎఫ్ కార్యాలయం వెనుక ఉన్న రైల్వే సిగ్నల్ టవర్‌పైకి ఎక్కి, కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంటానని కేకలు పెట్టాడు. విషయం తెలుసుకుని ఆర్పీఎఫ్ సిబ్బంది, పెరియమేడు పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి ప్రకాష్‌తో చర్చించారు. అగ్నిమాపక సిబ్బందిని రప్పించి ప్రకాష్‌ను కిందకు దింపే ప్రయత్నాలు చేశారు. పోలీసులు హెచ్చరించడంతో ప్రకాష్ కిందకు దిగాడు. ఆ తర్వాత పోలీసులు ప్రకాష్ కుటుంబ సభ్యులను రప్పించి అతడిని అప్పగించారు. ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడకూడదంటూ హెచ్చరించి పంపారు.

స్టంట్ మాస్టర్ కనల్ కణ్ణన్‌పై కేసు రద్దు

అడయార్, అక్టోబరు 3: హిందు మున్నని నేత, స్టంట్ మాస్టర్ కనల్ కణ్ణన్‌పై చెన్నై నగర సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన కేసును మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. హిందూ హక్కుల పరిరక్షణ పోరాట పాదయాత్ర ముగింపు వేడుకలు ఆగస్టు ఒకటో తేదీ జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న కనల్ కణ్ణన్... పెరియార్ విగ్రహ ధ్వంసం చేస్తామడంతో పాటు ఓ వర్గం ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయనీ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై ఎగ్మోర్ కోర్టులో సాగుతుంది. అయితే, ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జయచంద్రన్... ఆలయానికి ఎదురుగా ఉన్న విగ్రహంలో చెక్కిన మాటలను కారణంగా తీసుకుని పిటిషనర్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కేసును కొట్టివేసింది.

మహావిష్ణుకు బెయిల్ మంజూరు



చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాఠశాలల్లో దివ్యాంగులను కించపరిచేలా ప్రసంగించి అరెస్టయిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త మహావిష్ణుకు చెన్నై సెషన్స్ కోర్టు బెయిలు మంజూరు చేసింది. బెయిలు పిటిషన్‌లో నగరంలోని పాఠశాలల్లో ప్రసంగించినప్పుడు ఉద్దేశపూర్వకంగా తాను దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడలేదని, తన ప్రసంగాన్ని పూర్తిగా ప్రసారం చేయకుండా ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పెట్టారని, తన మాటలు దివ్యాంగులను కించపరిచే విధంగా ఉన్నట్లు భావిస్తే భేషరతుగా క్షమాపణలు చెప్పేందుకు సిద్ధమేనని మహావిష్ణు తెలిపారు. ఈ నేపథ్యంలో మేజిస్ట్రేట్ ఎస్ కార్తికేయన్ మహావిష్ణుకు బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

నగలు కాజేసిన యోగా టీచర్ అరెస్ట్

ప్యారీస్,అక్టోబరు 3: స్థానిక కేకే నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఇంట్లో 40సవర్లనగలు కాజేసిన యోగామాస్టర్ గాయత్రిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న శంకర్-జనని దంపతుల ఇంట్లోని బీరువాలో దాచిన నగలు ఇటీవల చోరీకి గురయ్యాయి. దీనిపై శంకర్ అందజేసిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, శంకర్ నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో సీసీ ఫుటేజీ పరిశీలించారు. అందులో శంకర్ భార్య జననికి యోగా శిక్షణ ఇచ్చేందుకు వెళ్లే అదే ఫ్లాట్‌కు చెందిన గాయత్రి నగలు చోరీచేస్తున్న దృశ్యాలు కనిపించాయి. దీంతో, ఆమెను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు కాగా, ఈ చోరీపై విచారణ జరిపేందుకు శంకర్ నుంచి గూగుల్ పే ద్వారా లంచంగా రూ.20,000లను ఆర్థిక నేర విభాగం ఎస్ఐ రాజేంద్రన్ పుచ్చుకున్నట్లు తెలిసింది. దీంతో ఆయనను ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి బదిలీ చేశారు.

'విజయ్ 69' నటీనటుల ఎంపిక షురూ


పూజా హెగ్డే

అగ్రహీరో విజయ్ నటించే 69వ చిత్రం కోసం నటీనటుల ఎంపిక జరుగుతోంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంలో పూజా హెగ్డేను ఒక హీరోయిన్‌గా, రెండో హీరోయిన్‌గా మలయాళ నటి మమతా బైజును ఎంపిక చేసినట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. అనిరుధ్ సంగీతం సమకూర్చే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం చెన్నైలో జరుగనుంది. ఇదిలావుంటే, ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇప్పటికే పలువురు నటులను ఎంపిక చేయగా, గురువారం మరో ముఖ్యపాత్ర కోసం నటుడు ప్రసన్నను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.అలాగే, ప్రముఖ సీనియర్ దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, ప్రముఖ నటి ప్రియమణిలను కూడా ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టును కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతుంది.

హీరో కావాలనే కోరిక తీరింది

● నూతన దర్శకుడు సదా నాడార్

వెండి తెరపై హీరోగా చూసుకోవాలనే తన లక్ష్యం 'ల్ తక సై ఆ' సినిమాతో నెరవేరిందని నూతన దర్శకుడు సదా నాడార్ తెలిపారు. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన 'ల్ తక సై ఆ' చిత్రం శుక్రవారం విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఈరోడ్ జిల్లాకు చెందిన నాకు చిన్నప్పటి నుంచే సినిమాల్లో నటించాలన్న కోరిక ఉండేది. ఇందుకోసం చెన్నై వచ్చాను. ఇండస్ట్రీలో ఎలాంటి పరిస్థితులున్నాయయో ఇక్కడకు వచ్చాక తెలుసుకున్నాను. ఈ క్రమంలో రూ.2 కోట్ల వరకు పోగోట్టుకున్నాను. ఆ తర్వాత నిజమైన స్నేహితులు ఎవరన్నది తెలిసింది. ఇపుడు వారితో కలిపి ప్రయాణం చేస్తున్నాను. నా తొలి చిత్రంలో హీరోయిన్‌గా నా భార్య మోనికా సెలీనా నటించారు. నిర్మాణ సంస్థ పేరు కూడా కపుల్స్ క్రియేషన్స్ అని పేరుపెట్టుకున్నాం. సినిమాకు కులమత భాషా భేదాలు లేవని చెప్పే పలువురు దర్శకులు తమ చిత్రాలను కుల బ్యాక్‌డ్రాప్‌లోనే తీస్తున్నారు. సినిమాల్లోకి ఎందుకు వచ్చారంటూ అనేక మంది ప్రశ్నిస్తున్నారు. ఇపుడు నేను చిన్న నిర్మాతను, కొత్త దర్శకుడిని కావొచ్చు... కానీ ఏదో ఒక రోజు పెద్ద దర్శకుడి స్థాయికి చేరుకుంటాను' అని పేర్కొన్నారు. హీరోయిన్ మోనికా సెలీనా మాట్లాడుతూ, 'వెండితెరపై హీరోయిన్‌గా నన్ను చూసుకోవాలన్న కోరిక నా భర్త ద్వారా నిజమైంది' అని ఆనందం వ్యక్తం చేశారు.


సదా నాడార్, మోనికా

సుధా కొంగరతో పనిచేయాలనివుంది


● దేవ్ రాంనాథ్



సుధా కొంగర, వెట్రిమారన్ వంటి వారి దర్శకత్వంలో నటించాలని వుందని, సుధా కొంగర ప్రాజెక్టు కోసం సంప్రదింపులు జరుగుతున్నాయని యువ నటుడు దేవ్ రాంనాథ్ వెల్లడించారు. 'వాయ్మై మూడి పేసవుం' చిత్రం ద్వారా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన రాంనాథ్ ఆ తర్వాత 'ఒరు నాల్ కూత్తు', 'వెల్లై పూక్కల్', 'మామకికి', 'పోర్', 'పేచ్చి' వంటి చిత్రాల్లో నటించగా, 'పట్ గేవా', 'ఐ హేట్ యూ ఐ లవ్ యూ', 'స్వీట్ కారం కాఫీ' వంటి వెబ్ సిరీస్‌ల్లో నటించారు. ఈ నేపథ్యంలో ఆయన సొంతంగా ఒక కొత్త ప్రాజెక్టు తన స్నేహితులతో కలిసి చేపట్టనున్నారు. ఇందులో హీరో స్థాయిలో ఉండే ముఖ్యమైన పాత్రలో నటించనున్నారు. ఇదే విషయంపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'నేను తొలి చిత్రంలో నెగిటివ్ పాత్రలో నటించి, ఆ తర్వాత ఆరు చిత్రాల్లో నటించాను. 'పేచ్చి' చిత్రం ద్వారా మంచి పేరు వచ్చింది. ఇపుడు తన స్నేహితులతో కలిసి ఒక ప్రొడక్షన్ హౌస్ ప్రారంభించాలని భావిస్తున్నాను. ఇప్పటివరకు మూడు ప్రాజెక్టులున్నాయి. నా స్నేహితులతో కలిసి నిర్మించే చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాను. తెలుగులో అనేక మంది యంగ్ హీరోలు వస్తున్నారంటే దానికి కారణం ఔత్సాహిక నిర్మాతలు వారితో సినిమాలు తీసేందుకు ముందుకు రావడమే. కానీ, కోలీవుడ్‌లో ఆ పరిస్థితి లేదు. నా దృష్టిలో హీరో కంటే కథ ముఖ్యం. కోలీవుడ్ దర్శకుల్లో సుధా కొంగర, వెట్రిమారన్ దర్శకుల్లో నటించాలని ఉంది. కథలకు ప్రాధాన్యత ఇస్తే దర్శకులతో కలిసి పనిచేయాలని ఉంది' పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

'వేట్టయన్' విడుదలపై స్టేకు కోర్టు నిరాకరణ



అడయార్, అక్టోబరు 3: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్' చిత్రం విడుదలపై స్టే విధించేందుకు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ నిరాకరించింది. అయితే, ఈ అంశంలో నిర్మాణ సంస్థ, సెన్సార్ బోర్డు వివరణ ఇవ్వాలంటూ నోటీసులిచ్చింది. ఈ చిత్రం ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఇందులో ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన డైలాగులను తొలగించాలని, అప్పటివరకు చిత్రం విడుదలకాకుండా తాత్కాలిక స్టే విధించాలని కోరుతూ పళనివేల్ అనే వ్యక్తి మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. దీనిపై గురువారం విచారణకు స్వీకరించిన కోర్టు... సినిమా విడుదలపై స్టే విధించేందుకు నిరాకరిస్తూ, ఈ అంశంపై నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్, సెన్సార్ బోర్డుకు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేశారు.



'కింగ్ మేకర్' పేరుతో ఆర్ఎంవీపై డాక్యుమెంటరీ

ప్రముఖ లెజెండరీ నిర్మాత, రాజకీయ నేత ఆర్.ఎం.వీరప్పన్ జీవిత చరిత్ర ఆధారంగా 'కింగ్ మేకర్' పేరుతో ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్ రూపొందనుంది. సత్య మూవీస్ పతాకంపై నిర్మితమయ్యే ఈ డాక్యుమెంటరీని తమిళ చిత్రపరిశ్రమకు సంబంధించి పలు ఆసక్తికరమైన అంశాలతో తెరకెక్కించనున్నారు. పెరియార్, అన్నాదురై వంటి మహానేతలతో ఎంతో సన్నిహితంగా మెలిగిన ఆర్ఎంవీ... డీఎంకే రెండుగా చీలిన తర్వాత అన్నాడీఎంకే వైపు వెళ్ళిపోయారు. ఆ తర్వాత మూడుసార్లు ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత మంత్రివర్గంలో మంత్రిగా కూడా పనిచేశారు. పురట్చితలైవర్ ఎంజీఆర్, సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ తరాలు ఆయనను స్మరించుకునేలా ప్రపంచ స్థాయి డాక్యుమెంటరీని రూపొందించనున్నారు. ఇదే విషయంపై సత్యమూవీస్ ప్రతినిధి తంగరాజ్.. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను కలిసి చర్చించారు. ఇందులో నటించే నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

ఆధ్యాత్మికం


కైలాసనాథస్వామి

నవగ్రహాల్లో సూర్య, చంద్రులు ముఖ్యులు. చంద్రుడికి తమిళంలో 'తింగళ్', తెలుగులో 'సోముడు' అనే పేర్లున్నాయి. చంద్రుడు శుక్లపక్షంలో వరాలిస్తూ, కృష్ణపక్షంలో సాధారణంగా ఉంటారు. చంద్రుడు శుభగ్రహాలకు ఆత్మీయగ్రహంగా ఉండటం వల్ల, ఒకరి జాతకంలో చంద్రుడు ఉన్నతస్థితిలో ఉన్నట్లయితే, సకలసౌభాగ్యాలు, శుభాలు కలుగుతాయి. అటువంటి చంద్రుడి పరిహార క్షేత్రం తింగళూరు కైలాసనాథస్వామి ఆలయం. ఈ ఆలయంలో చంద్రుడు ప్రత్యేక సన్నిధిలో కొలువై పూజలందుకుంటున్నారు. తమిళ శైవభక్తశిఖామణి అప్పర్ తన కీర్తనల్లో ఈ స్థలవిశేషాలను కొనియాడారు. ఈ ఆలయంలోని స్వామివారిని కైలాసనాథుడని, అమ్మవారిని పెరియనాయకి అని పిలుస్తున్నారు. ఈ క్షేత్ర తీర్థం చంద్రపుష్కరిణి కాగా స్థలవృక్షం బిల్వవృక్షం.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


పెరియనాయకి అమ్మవారు

చోళరాజుల నాటి నిర్మాణం..

చంద్రుడి శాపవిమోచన క్షేత్రం

● తింగళూరు కైలాసనాథస్వామి ఆలయం

స్థలపురాణం..

అమృతంకోసం పాలకడలిని మధించినప్పుడు వచ్చిన హాలాహలాన్ని పరమేశ్వరుడు స్వీకరించి సకలజీవరాశులను రక్షించి నీలకంఠుడయ్యారు. అయినా ఆ ప్రాంతమంతటా వ్యాపించిన హాలాహలం ప్రభావం కారణంగా దేవతలంతా మూర్ఛిల్లారు. ఆ సమయంలో అమృతభాండంతో ఆవిర్భవించిన చంద్రుడు దేవతలను మైకం నుండి బయటపడేలా చేశారు. అంతటి చంద్రుడిని పరమశివుడు తన శిరస్సుపై ధరించారు. దీంతో పరమేశ్వరుడిని ఆరాధించే భక్తులంతా పరోక్షంగా, అదనంగా


కుటుంసమేతంగా దర్శనమిస్తున్న అప్పూది అడిగళ్

చంద్రుడి అనుగ్రహాన్ని కూడా పొందుతారు. ఈ కారణంగానే దక్షుడు తన 27 మంది 27 నక్షత్ర కుమార్తెలను చంద్రుడికిచ్చి వివాహం జరిపించాడు. తన కుమార్తెలందరినీ సమానంగా చూడాలని దక్షుడు సూచించాడు. అయితే చంద్రుడు దక్షుడి కుమార్తెల్లో అత్యంత సౌందర్యరాశి అయిన రోహిణితోనే ఎక్కువకాలం గడిపేవాడు. ఈ విషయాన్ని తక్కిన కుమార్తెలు తండ్రికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహించిన దక్షుడు చంద్రుడి అందం రోజురోజుకూ తగ్గిపోతుందంటూ శపించాడు. ఆ శాపం కారణంగా చంద్రుడు తన 14 రకాల అందాలను కోల్పోయాడు. మిగిలిన అందాన్నయినా మిగుల్చుకోవాలని చంద్రుడు వెంటనే పరమేశ్వరుడిని ఆశ్రయించాడు. ఈశ్వరుడి సూచన పాటించి ఈ క్షేత్రంలో తన పేరుతో ఓ తీర్థాన్ని ఏర్పరచి, పరమేశ్వరుడిని ధ్యానిస్తూ తపమాచరించాడు. పంగుణి నెల పౌర్ణమి రోజున కైలాసనాథుడు చంద్రుడి ఎదుట ప్రత్యక్షమై శాపవిముక్తి కలిగించారు. చంద్రుడు శాపవిమోచనం పొంది, కోల్పోయిన అందాలను తిరిగిపొంది, కాంతిమంతుడైన క్షేత్రమే ఇది. దక్షుడి శాపంతో చంద్రుడి అందాలు తగ్గుతూ అమావాస్య దినాన అదృశ్యమయ్యే చంద్రుడిని మళ్ళీ క్రమంగా కాంతిని, అందాన్ని పొందుతూ పౌర్ణమి రోజున అత్యంత కాంతివంతుడై లోకానికి వెలుగిచ్చేలా పరమేశ్వరుడు అనుగ్రహించాడు.

చంద్రదోష పరిహారం..

చంద్రదోష విముక్తి కోసం ఈ ఆలయానికి వచ్చే భక్తులు, చంద్రుడి శాపాన్ని తొలగించిన సర్వశక్తిమంతుడైన కైలాసనాథుడిని కూడా దర్శించి, ప్రత్యేక పూజలు చేస్తారు. శివాలయాల్లో సాధారణంగా శివలింగంపై సూర్య కిరణాలు లేదా చంద్రుడి కిరణాలు మాత్రమే ప్రసరిస్తుంటాయి. అయితే ఈ ఆలయంలో కైలాసనాథుడిపై పురటాసి నెలలో సూర్యకిరణాలు, పంగుణి మాసంలో చంద్ర కిరణాల ప్రసరిస్తాయి. సూర్య కిరణాలు ప్రసరించే దినాలల్లో


ఆలయ అంతరప్రాకారం


చంద్రభగవానుడు

సూర్య పూజ, చంద్రుడి కిరణాలు ప్రసరించేటప్పుడు చంద్ర పూజ నిర్వహిస్తుంటారు. చంద్రుడి శ్రేష్ఠమైన పరిహార స్థలంగా ఈ ఆలయం పేరొందింది. ఏదైనా ఓ శుక్ల పక్షం సోమవారంనాడు ఉదయం 9 గంటల లోపు ఈ ఆలయంలోని చంద్రుడికి అభిషేకం, అర్చన చేసి ధవళవస్త్రాన్ని ధరింపజేస్తే జాతకరీత్యా చంద్ర దోషాలు తొలగి, సకలసౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ పరిహార పూజలను ఆరునెలలకొకసారి గాని, యేడాదికి ఒకసారి గాని చేయడం శుభదాయకం.

ఎలా వెళ్ళాలి?

ఈ ఆలయం తంజావూరు జిల్లా కుంభకోణం నుంచి తిరువయ్యారు వెళ్లే రహదారిలో, కుంభకోణంకు 33 కి.మీ.ల దూరంలో, తిరువయ్యారుకు సుమారు 3 కి.మీ.ల దూరంలో ఉంది. చెన్నై నుంచి రాష్ట్రంలోని ప్రముఖ నగరాల నుంచి కుంభకోణం, తిరువయ్యారు ప్రాంతాలకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. తిరువయ్యారుకు చేరుకున్నాక అక్కడి నుంచి టౌన్ బస్సులు, ఆటోల్లో ప్రయాణించి తింగళూరు కైలాసనాథర్ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతి రోజూ ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటలవరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయ వైభవం...

ప్రాచీన శిల్పకళల తొలినాళ్ల నిర్మాణవైభవం ప్రతిబింబించేలా ఉన్న, ఈ ఆలయాన్ని క్రీ.శ. 10, 12వ శతాబ్దాంలో చోళ చక్రవర్తులు నిర్మించినట్లు పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. తూర్పువైపు రాజగోపురం కలిగిన ఈ ఆలయం రెండు ప్రాకారాలతో ఉంది. ఈ ఆలయానికి దక్షిణవైపు ప్రధాన ప్రవేశ ద్వారం ఉంది. ఆలయానికి ఎదురుగా ఓ పెద్ద నంది, గర్భాలయంలో నల్లని గ్రానైట్ రాతితో తయారైన 16 దిక్కుల సహస్రలింగంగా మూలవర్లు తూర్పుదిశగా కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నారు. అమ్మవారు పెరియనాయకి సన్నిధి దక్షిణాభిముఖంగా ఉన్నారు. ఆలయానికి ముందు చంద్రతీర్థం కూడా ఉంది. ఆలయ వెలుపలిప్రాకారంలో ప్రదక్షిణ చేస్తుంటే వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, గోష్ఠంలో ఆశీనభంగిమలో దక్షిణామూర్తి, గజలక్ష్మి సన్నిధులు కనిపిస్తాయి. ఇదేవిధంగా చండికేశ్వరుడు, చండికేశ్వరీ సమేతుడై దర్శనమిస్తారు. ఇక భైరవుడు ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరారు. ఈ ఆలయంలో క్షేత్రపాలకుడైన చంద్రుడు పడమటిదిశగా మూలవిరాట్టు పరమేశ్వరుడి వైపు చూస్తున్నట్లు ప్రత్యేక సన్నిధిలో కొలువయ్యారు. ఆలయ అంతరప్రాకారం ఎడమవైపు అప్పూది అడిగళ్, ఆయన సతీమణి అరుళ్‌మొళి, ఇద్దరు తనయుల విగ్రహాలున్నాయి.


వినాయకుడి సన్నిధి

ఆలందూర్‌లో అభివృద్ధి పనులు


ఆదంబాక్కం చెరువును పరిశీలిస్తున్న మంత్రులు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై కార్పొరేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో ఆలందూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రులు పీకే శేఖర్‌బాబు, టీఎం అన్బరసన్ గురువారం పరిశీలించారు. ఆదంబాక్కం చెరువును రూ.10 కోట్లతో అభివృద్ధికి సంబంధించి అధికారులతో చర్చించారు. ఇదే విధంగా ఆదంబాక్కం బాలకృష్ణా నగర్‌లో రూ.5.60 కోట్లతో నిర్మితమవుతున్న నూతన కమ్యూనిటీ హాలు కూడా తనిఖీ చేశారు. ఆలందూర్ పుదు వీధిలో రూ.15 కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. కోవూరు కోనేరును రూ.4.5 కోట్లతో అభివృద్ధి చేయడంపైనా సమీక్షించారు. అయ్యప్పన్‌తాంగల్ బస్టాండును రూ.10 కోట్లతో అభివృద్ధి చేసే పథకంపైనా చర్చించారు. ఒకే రోజులో ఆలందూర్ నియోజకవర్గంలో 5 పథకాలపై మంత్రులు సమీక్షించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

స్పేస్ కిడ్జ్‌తో నార్త్‌ర్న్ యూని యూఎన్‌ఐ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నార్త్‌ర్న్ యూని, స్పేస్ కిడ్జ్ ప్రతినిధులు

అడయార్, అక్టోబరు 3: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాన్ని పురస్కరించుకుని నార్త్‌ర్న్ యూని... స్పేస్ కిడ్జ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఇన్‌స్పేస్ అహ్మదాబాద్ డైరెక్టర్ డాక్టర్ ప్రఫుల్లా కుమార్, ఎస్ఎల్ఐఐటీ నార్త్‌ర్న్ యూని చైర్మన్, ఎండీ పద్మనాభన్, స్పేస్‌కిడ్స్ ఇండియా ఫౌండర్, సీఈవో డాక్టర్ కేశన్, వరల్డ్ స్పేస్ వీక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆల్మా ఓక్‌పలేపె, ఎడ్యుకేషనల్ సైకాలజిస్టు డాక్టర్ శరణ్య జయకుమార్, చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు జాఫ్నాలోని నార్త్‌ర్న్ యూని, భారత్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి సంయుక్తంగా ఒక ఉపగ్రహ రూపకల్పన, అభివృద్ధి, ప్రయోగాలను చేపట్టనున్నారు. అంతరిక్ష వాతావరణాన్ని అధ్యయనం చేయడానికి, అత్యాధునిక కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రదర్శించడానికి ఉద్దేశించిన అధునాతన పరికరాలను ఉపగ్రహం తీసుకెళుతుంది. ఈ సందర్భంగా స్పేస్ కిడ్జ్ ఫౌండర్ శ్రీమతి కేశన్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం భారత్, శ్రీలంక దేశాల మధ్య ఉన్న భాగస్వామ్య ఒప్పందాలను సూచిస్తుందన్నారు. విద్య, సాంకేతిక, అంతరిక్ష పరిశోధనలను ప్రజలను ఏకం చేయడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.


అన్నా విశ్వవిద్యాలయంలో సర్వేయింగ్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ సెంటర్‌లో గురువారం కొత్త శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్


అలందూరు నియోజకవర్గం పరిధిలో రూ.4.50కోట్లతో అభివృద్ధి చేయన్ను కోవూరు చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు దామో అన్బరసన్, పీకే శేఖర్‌బాబు, అధికారులు

అర్ధరాత్రి అట్టహాసంగా మహాలయ అమావాస్య వేడుకలు

● మేల్‌మలయనూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి మహాలయ అమావాస్య వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని గర్భాలయంలో అమ్మవారికి, పరమేశ్వరుడికి పసుపు, విభూతి, కుంకుమ, పంచామృతం, నారికేళజలం, తేనె, పన్నీరు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణకవచంతో అలంకరించగా, రకాల పూలమాలలతో సర్వాలంకరణశోభితురాలై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తి అమ్మవారిని శ్రీవైష్ణవ దేవి అలంకారంతో ఆలయ అంతర ప్రాకారంలో ఆశీనులు కావించారు. రాత్రి 11 గంటలకు అమ్మవారు పంబై, మేళతాళాలు మోగుతుండగా ఉత్తర ప్రవేశ ద్వారం గుండా ఊయల మంటపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఊయల్లో అమ్మవారిని ఆశీనులు కావించి పూజారులు భక్తిగీతాలను ఆలాపించారు. రాత్రి 12 గంటలకు అమ్మవారికి అర్చనలు, మహాదీపారాధనతో ఊంజల్ ఉత్సవం నిర్వహించారు. ఆ సందర్భంగా వేల సంఖ్యలో మహిళలు చేతిలో ప్రమిద దీపాలు పట్టుకుని నిలిచారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


ఊంజల్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

నిర్మాత కేఎస్ రామకృష్ణకు మాతృవియోగం


రాజరత్నమ్మ (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సినీ నిర్మాత, దక్షిణ భారత ఫిలిం ఛాంబర్ ఉపాధ్యక్షులు కేఎస్ రామకృష్ణకు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కొండసాని రాజరత్నమ్మ (90) గురువారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో పాటు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజరత్నమ్మ తమ స్వస్థలమైన ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్ జంక్షన్‌లో వున్న స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు శుక్రవారం హనుమాన్ జంక్షన్‌లో జరుగనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఇదిలా వుండగా రాజరత్నమ్మ మృతి పట్ల సీనియర్ నిర్మాత, దక్షిణభారత ఫిలింఛాంబర్ మాజీ అధ్యక్షులు కాట్రగడ్డ ప్రసాద్ తీవ్ర సంతాపం తెలిపారు. రామకృష్ణ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

బతుకమ్మ...బతుకమ్మ..ఉయ్యాలో..

● చెన్నై తెలంగాణా సంఘం ఆధ్వర్యంలో అంబరాన్నంటిన సంబురం


బతుకమ్మ సంబరాల్లో మంత్రి పీకే శేఖర్‌బాబు, తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 3: చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో అతివల పూల సంబరం అంబరాన్నంటింది. తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..తంగేడు పూవు పువ్వే గౌరమ్మ' అంటూ మహిళల గౌరమ్మ పాటలు, యువతుల జానపద నృత్యాలు అలరించాయి. నగరంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన వారంతా రావడంతో వేదిక ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, తెలంగాణా రాష్ట్రం తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి వైభవం బతుకమ్మ సంబరం అని, చెన్నైలో స్థిరపడిన తెలంగాణ ఆడపడుచులతో బతుకమ్మ విశిష్టత చాటుతూ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. చెన్నై తెలంగాణా సంఘం భవిష్యత్తులోను ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందన్నారు. వేదికపై ముఖ్యఅతిథులతో పాటు తెలంగాణ కుల సంఘాల నాయకులు, బతుకమ్మ ఉత్సవ కమిటీ నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు ఎం.పరశురామ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కోశాధికారి ఎస్కే షఫి, గౌరవాధ్యక్షులు బి.అంజయ్య, నిర్వాహకులు సీహెచ్ గిరి, ఎన్.అశోక్, సీహెచ్ నర్సింహ, పీఎల్ శ్రీనివాస్, సీహెచ్ రామ్మూర్తి, సి.అంజయ్య, కొడవర్తి స్వామి, ఎం.మల్లయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి, అందరికీ ప్రసాదాలు పంపిణి చేశారు.


బతుకమ్మల ముందు తెలంగాణా ఆడపడుచుల సందడి